హాజరైన సభ్యులు

సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

జిల్లా ప్రగతికి సమన్వయంతో పనిచేయాలి

జడ్పీ సర్వసభ్య సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్‌కుమార్ కోరారు. మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పరిపాలన వ్యవస్థను మార్గదర్శకంగా ముందుకు నడపడమే సమావేశ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. గ్రామాలు, మండలాల్లో ఎక్కడైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు (ప్రజాపాలన, తదితర) పనులను పునః ప్రారంభిస్తామని పింకేశ్‌కుమార్ తెలిపారు. యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించుకొని, సంబంధించిన శాఖల పనులను ప్రతిరోజూ పర్యవేక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించి, చేపట్టిన మౌలిక వసతుల (టాయిలెట్స్, తాగునీరు, ఫ్లోరింగ్, విద్యుత్, తదితర) పనులు జిల్లాలో 82 శాతం పాఠశాలల్లో పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకంలో వేలాది మంది కూలీలు లబ్ధి పొందుతూ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్సీలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టి విధులకు హాజరు కాని వైద్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అంతకు ముందు జిల్లా పురోగతిపై అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. సమావేశంలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కేటాయించిన స్థలం కబ్జా

ఎంపీడీవోకు సంఘం నాయకుల ఫిర్యాదు

ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగుల సంఘం ప్రతినిధులు

నర్మెట, జూన్ 18 : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో దివ్యాంగుల కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేశారని ఎంపీడీవో అరవింద్‌కు మంగళవారం దివ్యాంగుల సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో అమ్మాపురం వెళ్లే రహదారి వైపు తెలంగాణ మోడల్ స్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో 80గజాలను దివ్యాంగుల కమ్యూనిటీ హాల్‌కు కేటాయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత సర్పంచ్ దివ్యాంగుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీలో తీర్మానం చేయించారు. అయితే నర్మెటకు చెందిన అంగన్‌వాడీ టీచర్ దన్నారపు శోభ ఆమె ఇంటి పక్కన ఉన్న దివ్యాంగులకు కేటాయించిన స్థలాన్ని కొంత కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీవో, తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వారు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని దివ్యాంగుల సంఘం నాయకులు మోడెం రాజు, టీ రామారావు తెలిపారు.

కబ్జా ఆరోపణలు అవాస్తవం..

ఈ విషయమై అంగన్‌వాడీ టీచర్ దన్నారపు శోభను వివరణ కోరగా దివ్యాంగులకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయలేదన్నారు. తమ ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కారు కోసం తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశామని తెలిపారు. మాకు స్థలాన్ని కబ్జా చేయాల్సిన అవసరం లేదని, ఎవరికైనా ఇబ్బంది ఉంటే రేకుల షెడ్డును తొలగిస్తామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ Urgent Requirement for Corporate DSA Office Fresher & Exp. Female Tele-Callers, Quali: 12th & Best Talking Skills. Vacancies-30, Sal+Incentives etc., Job Location: HNK. Cont: 9032744373.
NTW-7701

CHANGE OF NAME
★I, NIMMANI SANTHOSH (New name), H.No. 19-10-207, Shambunipet, Rangashaipet, Warangal dist.-506002, T.S., NIMMANI SANTOSH (Old Name), hence forth be charged as NIMMANI SANTHOSH for all purpose.
NTW-00

EDUCATION
★ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

లీజు / కిరాయి
★ HNK, అదాలత నుండి K.L.N. రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్, (S.V.కాలనీ) రోడ్ నెం.5, 1st, 2nd, 3rd అంతస్థుల భవనం 1650Sft కిరాయికి/ లీజు ఇవ్వబడును. (న్యూ బిల్డింగ్) సంప్ర ॥ 9502879612.
KMM_11687

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

ఎస్సైకి వినతి పత్రం ఇస్తున్న సోము

బాలల హక్కులను పరిరక్షించాలి

పాలకుర్తి, జూన్18: రాజ్యాంగంలో బాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించాలని బాలల హక్కుల సంరక్షణ సంస్థ వ్యవస్థాపకుడు ఎడవెల్లి సోము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో బాలికపై జరిగిన లైంగిక దాడిని ఆయన గుర్తు చేస్తూ దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. పాలకుర్తి మండలంలోని ఇటుక బట్టీలలో 18 ఏళ్లలోపు బాలికలు ఎంతోమంది ఉంటున్నారని, వీరికి రక్షణ కల్పించాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు.

బచ్చన్నపేటలో మోస్తరు వర్షం

బచ్చన్నపేట, జూన్ 18 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా ఎండలు మండుతుండడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. మరోవైపు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు వర్షం ఊరటనిచ్చింది. ఉపాధిహామీ కూలీలు ఇటీవల గ్రామాల్లో నాటిన మొక్కలకు ఊపిరి పోసింది. మరోవైపు మండల కేంద్రంలో గంటసేపు జోరు వాన కురవడంతో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల సేకరణలో నిమగ్నమయ్యారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని వీడాలి

- **డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలి**
- **ప్రభుత్వ దవాఖాన తనిఖీలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా**

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 18 : డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బందికి సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విధుల్లో ఉన్నవారు, రిజిస్టర్లలో సంతకాలు చేసిన సిబ్బందిని పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌ను విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లోని రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వార్డులో ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని రోగులు చెప్పడంతో సాయంత్రం వరకు ఏర్పాటు చేయించారు. ఆసుపత్రి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించేలా చూడాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆసుపత్రి స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీవో డీఎస్ వెంకన్న..

ఆసుపత్రి స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీవో డీఎస్ వెంకన్నను నియమిస్తున్నట్లు కలెక్టర్ షేక్‌రిజ్వాన్ భాషా తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు, హాజరు పట్టికను పరిశీలించి తనకు నివేదిక పంపాలని ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో, జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఈ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, రోగులు ఏ సమయంలో వచ్చినా సేవలు అందించి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

సర్కారు స్కూళ్ల బలోపేతమే ధ్యేయం

- **కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా**
- **జఫర్‌గఢ్‌లో ప్రభుత్వ పాఠశాలలు, దవాఖాన పరిశీలన**

విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

జఫర్‌గఢ్, జూన్ 18 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే సర్కారు ధ్యేయమని, ఇందుకనుగుణంగా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. మంగళవారం స్థానిక తహసిల్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలించారు. ధరణితోపాటు రెవెన్యూపరమైన సమస్యలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథపై నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ దవాఖానలోని రోగులకు అందుతున్న వైద్యం, డాక్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు ఏకరూప దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షేక్‌రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. రైతులకు గ్రామాల్లో విత్తనాల కొరత లేకుండా చూడాలని ఫర్టిలైజర్ షాపు యజమానులకు కలెక్టర్ సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మినా, బ్లాక్‌లో అధిక ధరకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సుమన్, డీఈవో రాము, ఏఈ కృష్ణారెడ్డి, కేజీబీవీ స్పెషలాఫీసర్ స్వప్న, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, ఆర్ఐ అనిల్‌బాబు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

జనగామ చౌరస్తా, జూన్ 18 : స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. నర్మెట మండలానికి చెందిన మహిళా సంఘాల ప్రతినిధులు, ఏపీఎంలు ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో పాటు పురస్కారాలు పొందారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను రాష్ట్రంలోనే అన్నిరంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఆర్డీవో మొగులప్ప, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

'చేతులెత్తి మొక్కుతాం.. జీతాలు ఇవ్వండి'

ఎంపీడీవోకి వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్మికులు

తరిగొప్పుల, జూన్ 18: చేతులెత్తి మొక్కుతాం.. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించండి అని తెలంగాణ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారోజు రామ చంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జీపీ కార్మికులతో ఆందోళన నిర్వహించిన అనంతరం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రామచంద్రం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆయన ఆవేదన చెందారు. జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ కొమురయ్య, నాగపురి సతీశ్‌గౌడ్, సరిత పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సన్మానిస్తున్న పీఆర్టీయూ బాధ్యులు

పదోన్నతి పొందిన హెచ్‌ఎంలకు సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 18 : పదోన్నతులు పొంది ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలను పీఆర్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని నమిలిగొండ యూపీఎస్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి పదోన్నతిపై శివునిపల్లి బాలుర హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన కుసుమ రమేశ్, తరిగొప్పుల మండలం పోతారం యూపీఎస్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి స్టేషన్‌ఘన్‌పూర్ బాలికల హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన సంపత్‌ను పీఆర్టీయూ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నోడల్ ఆఫీసర్ కోమురయ్య, రాష్ట్ర బాధ్యులు ప్రవీణ్, రవికుమార్, ధారణ సత్యప్రకాశ్, గిరి, శ్రీధర్, సదామోహన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు

ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసి పట్టుబడిన వైనం

జనగామ చౌరస్తా, జూన్ 18 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన ఓపెన్ డిగ్రీ ఫస్టియర్ ఇంగ్లిష్ పరీక్షకు ఒకరికి బదులు మరొకరు రాస్తూ ఇన్విజిలేటర్లకు పట్టుబడిన ఇద్దరు విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జనగామ అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపారు. విద్యార్థిని కొప్పుల మమతకు బదులు వెలిశాల మమత, విజయ్‌కు బదులు ఎస్ రవికుమార్ పరీక్ష రాస్తూ ఇన్విజిలేటర్లకు పట్టుబడ్డారు. వీరంతా యాదాద్రి జిల్లా భువనగిరి మండలానికి చెందినవారని సీఐ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు విద్యార్థులపై ఎస్సై సృజన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి పోరాటం

చిల్పూరు, జూన్ 18 : మండలంలోని భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 19న జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు గ్రామాల్లో భూవివాదాలు ఉన్నాయని, నిజమైన పేదలకు ప్రభుత్వం భూములు పంచాలని ఆయన కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి తరలిరావాలని కోరారు.

ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న నోడల్ అధికారి కొమురయ్య

నులిపురుగు నివారణకు వైద్యశాఖ చర్యలు

20న బాలలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జనగామ చౌరస్తా, జూన్ 18 : నులి పురుగుల నివారణలో భాగంగా ఈ నెల 20వ తేదీన ఒకటి నుంచి 19 ఏళ్లలోపున్న బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ బీ తేజ, సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారొక ప్రకటన విడుదల చేశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు నులి పురుగు నివారణ కోసం మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీన అందుబాటులో లేని పిల్లలకు ఈ నెల 27వ తేదీన మాప్ అప్ డే కార్యక్రమం ద్వారా మాత్రలు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. రెండు నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలకు పూర్తి మాత్రను స్పూన్‌లో పొడిచూర్ణం చేసి, నీటితో కలిపి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు తాగిస్తారని తెలిపారు. మూడు నుంచి 19ఏళ్ల వయసున్న బాలబాలికలు మాత్రను నమిలి చప్పరించిన తర్వాత నీరు తాగాలని సూచించారు.

ఆల్బెండజోల్ మాత్రను ఆహారం తీసుకున్న తర్వాతే పిల్లలు లేదా బాలబాలికలకు ఇవ్వాలని సూచించారు. ఖాళీ కడుపుతో ఉన్న వారికి మాత్ర ఇవ్వకూడదని ఆదేశించారు. పాఠశాల, కళాశాలలో సంబంధిత ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమక్షంలో మాత్రమే మాత్రలు పంపిణీ చేయాలని వైద్యాధికారి తేజ, సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ సూచించారు.

సర్వేను వేగవంతం చేయాలి : ఎంపీడీవో

బచ్చన్నపేట, జూన్ 18 : మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన మిషన్‌భగీరథ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి సర్వే తీరును పర్యవేక్షించారు. రఘురామకృష్ణ మాట్లాడుతూ మిషన్ భగీరథ సర్వేను పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏలు, ఫీల్డు అసిస్టెంట్లు ముందుకు నడిపించాలని కోరారు. ఏ ఒక్క ఇల్లు మిస్‌కాకుండా సర్వే చేయాలన్నారు. డాటాలో డబుల్, షిఫ్టింగ్, మరణించిన వారి జాబితా రూపొందిస్తే టార్గెట్ పూర్తయ్యే ఆస్కారం ఉందన్నారు. సర్వే పూర్తిలో జిల్లాలోనే బచ్చన్నపేట మండలం ముం దంజలో ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమం లో గ్రామ కార్యదర్శులు, కారోబార్లు, వీ వోఏలు, ఫీల్డు అసిస్టెంట్లు అనిల్ రాజ్, బృంగి రూపాచైతన్య, భరత్, మోకు కవిత, దేవిప్రసాద్, రాధాకృష్ణ, రాజశేఖర్, భాను, ఉపేందర్, కరుణాకర్, మధు, సౌజన్య, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, ప్రశాంత్ ఆచార్య, ప్రశాంత్, మురళి, లలిత, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

సమస్యను వివరిస్తున్న బాధిత రైతులు

చిల్పూరు, జూన్ 18 : భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధిత రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన చేరాల పోషయ్య, నీల సాయవ్వ, నీల కనకవ్వకు 1990లో నాటి రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబర్లు 63, 69లో ఎకరం చొప్పున భూమిని పంపిణీ చేసి పట్టాలు ఇచ్చింది. అలాగే గ్రామంలోని 40మందికి ఎకరం చొప్పున ఇచ్చారు. బతుకు దెరువు కోసం వీరు కొద్ది రోజుల క్రితం వేరే ఊరికి వెళ్లారు. ఈ నేపథ్యంలో వీరి భూమిని గ్రామానికి చెందిన కొందరు నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి, ఫోర్జరీ చేసి ఇతరులకు విక్రయించారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులకు తెలిపినా పరిష్కారం కాలేదు. సమస్యను పరిశీలించి మా భూమిని మాకు ఇప్పించాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

బుగులు వెంకన్నను దర్శించుకున్న భక్తులు

108 బంగారు పద్మాలతో పూజలు

స్వామివారి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు

చిల్పూరు, జూన్ 18 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామి వారికి మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజలు చేశారు. తిరుపతిలో నిర్వహించినట్లుగా 108 బంగారు పుష్పాలతో మొక్కులు చెల్లించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన భక్తులు వేంకటేశ్వరుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ అష్టాదశ పాద పద్మారాధన పూజలను ప్రతి మంగళవారం నిర్వహిస్తామన్నారు. పూజల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం డైరెక్టర్ సంగోజు మోహన్‌చారి-శంకరలక్ష్మి దంపతులు, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, కృష్ణ, మహేశ్, రాజశేఖర్, విశాల్ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన నోడల్ ఆఫీసర్

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 18 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను మండల నోడల్ అధికారి జీ కొమురయ్య మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని దళిత కాలనీ, విశ్వనాథపురం, బీసీ కాలనీ, మాన్‌సింగ్ తండా, తానేదార్‌పల్లి, చంద్రుతండాలోని ప్రభుత్వ పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కొమురయ్య సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది గిరి, ఉపాధ్యాయులు జయమ్మ, సుజాత, కొమురెల్లి, అశోక్, వెంకటాచారి, రమేశ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, జూన్ 18 : రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ సర్వీస్-2025 లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణకు జిల్లాలో అర్హులైన అభ్యర్థులు జూలై 3వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ పాసైన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 040-24071178లో స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

టీజీపీఎస్సీ నిర్వహించే గ్రూపు-2 పరీక్ష అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రాండ్ టెస్ట్‌కు హాజరుకావడానికి www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా జూలై 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారను. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అదేవిధంగా మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రాండ్ టెస్ట్‌లు జరుగుతాయన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 040-24071178లో స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్‌ను సంప్రదించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

జనగామ చౌరస్తా, జూన్ 18 : తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశం కల్పించేందుకు జిల్లాలో అర్హులైన విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీలోపు మండల స్థాయిలో, 29వ తేదీన ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. విద్యార్థుల పుట్టిన తేదీ 1 సెప్టెంబర్ 2015 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య ఉండాలన్నారు. ఎత్తు, బరువుతోపాటు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, 800 మీటర్ల రన్, షటిల్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ పోటీల్లో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ, జూన్ 18 (నమస్తే తెలంగాణ)/ రఘునాథపల్లి : రఘునాథపల్లి మండల కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జనగామ డివిజన్ ఇంజినీర్(ఆపరేషన్స్) లక్ష్మీనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రఘునాథపల్లి, కంచనపల్లి, గబ్బెట, కోమల్ల, నిడిగొండ, అశ్వారావుపల్లి, ఖిలాషాపురం, కుందారం, వడిచర్ల సబ్‌స్టేషన్ల పరిధి లోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం చేస్తున్న శివకుమార్‌గౌడ్

పేదలకు సాయం చేయడమే ధ్యేయం

బచ్చన్నపేట, జూన్ 18 : పేదలకు తనవంతు సాయం చేయడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నానని బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవా కార్యకర్త కోడూరు శివకుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొన్నెకు చెందిన కట్కూరి సిద్ధులు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న శివకుమార్‌గౌడ్ సిద్ధులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.5వేలు ఆర్థిక సాయమందించారు. శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది సంపాదిస్తున్నా పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చేది కొందరేనన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఉమెంతల బాల్‌రెడ్డి, కురాం భాస్కర్, కొంక కనకయ్య, దాసారం వెంకటయ్య, చిన్న సిద్ధులు, వీరనారాయణ, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రహరీ పనులకు శంకుస్థాపన చేస్తున్న పోకల జమున

ఖబర్‌స్థాన్ ప్రహరీ పనులకు శంకుస్థాపన

జనగామ, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని ఖబర్‌స్థాన్‌లో ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షల వ్యయంతో చేపట్టే పనులకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వంగాల కల్యాణి, కౌన్సిలర్ మారబోయిన పాండు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్, ముస్లిం మత పెద్దలు జాకీర్, అబ్దుల్ రహమాన్, షకీల్, ఇక్బాల్, కాంగ్రెస్ నాయకుడు వీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

వెంకటరాజం (ఫైల్)

చిల్పూరు, జూన్ 18 : ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సట్ల వెంకటరాజం(45) రోజు మాదిరిగానే మంగళవారం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన బాధితుడిని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌నాయక్ కుటుంబానికి పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కొడకండ్ల, జూన్ 18 : మండలంలోని నీలిబండ తండాకు చెందిన బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు గుగులోత్ జగన్‌నాయక్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు దీకొండ వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. నాయకులు విమలాసోమానినాయక్, పాలకుర్తి నియోజకవర్గ సోషల్‌మీడియా కో-ఆర్డినేటర్ దేశగాని సతీశ్, తుకారం, రణధీర్, చిలుకమ్మ పాల్గొన్నారు.